## క్లుప్తంగా

### నవరాత్రి వేడుకలకు కేతిరెడ్డికి ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్:** పట్టణంలోని అమ్మవారిశాలలోని మత్యస్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో దసరాను పురస్కరించుకుని నిర్వహించే శరన్నవరాత్రి వేడుకలకు బుధవారం ఆర్యవైశ్య సంఘం నాయకులు స్థానిక మాజీ ఎమ్మెల్యే నివాసంలో కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించే అమ్మవారి అలంకరణలు, కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సురేంద్ర నాథ్, ఉపాధ్యక్షుడు మద్దిలేటి (రాజు) తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ



పేరం నాగిరెడ్డిని పరామర్శిస్తున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

**తాడిపత్రిటౌన్:** తాడిపత్రి మున్సిపల్ మాజీ చైర్మన్ పేరం నాగిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి బుధవారం పరామర్శించారు. మోకాలికి శస్త్రచికిత్స తీసుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ను కేతిరెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పేరం గోకుల్‌నాథ్‌రెడ్డి, పేరం ప్రతాప్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ధ్యేయం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని

**గుంతకల్లుటౌన్:** వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమిషనర్ నయీమ్ అహమ్మద్ సూచించారు. బుధవారం వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వలంటరీ టీచర్లకు శిక్షణ ఇచ్చి మెటీరియల్ పంపిణీ చేశారు. పట్టణంలో 6,300 మంది నిరక్షరాస్యులను గుర్తించి, వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి 630 మంది వలంటీర్లను నియమించినట్లు ఎంఈఓ మస్తాన్‌రావు, వయోజన విద్య సూపర్‌వైజర్ శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, టీఎంసీ కెరణ్, సీఓలు పాల్గొన్నారు.


### ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

**గుంతకల్లుటౌన్:** పట్టణంలోని దోనిముక్కల రోడ్డు వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ స్థలంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటాన్ని ఉంచి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సంపత్‌ఆచారి, ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, కోశాధికారి మధుసూదనాచారి, సంఘం పెద్దలు హరిప్రసాద్ ఆచారి , రమణాచారి, సర్వేశ్వరరావు, ఆదిశేషాచారి, ప్రదీప్‌ఆచారి, కృష్ణమాచారి, మహిళలు పాల్గొన్నారు.

### కార్పొరేట్ సెలూన్ షాపులు తొలగించాలి



సంతకాలు సేకరిస్తున్న క్షౌర వృత్తిదారుల సంఘం నాయకులు

**గుంతకల్లుటౌన్:** నాయీబ్రాహ్మణుల పొట్ట కొట్టకొడుతూ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించే వరకూ పోరాటాలు కొనసాగిస్తామని క్షౌ రవృత్తిదారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కోశాధికారి బ్రహ్మ తెలిపారు. కార్పొరేట్ సెలూన్‌షాపులు తొలగించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ ఆఫీసు వద్ద క్షౌ రవృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కాటికాపరుల సంఘం రాష్ట్ర నాయకుడు జగ్గిలి రమేష్, సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్, సీఐటీయూ పట్టణ కార్యదర్శినాగరాజు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో క్షౌరవృత్తిదారుల సంఘం నాయకులు శివ శంకర్, రంగా, సురేంద్ర, మధు, చరణ్, సాయి, బాలు తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



ఎద్దులపల్లిలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శివశంకర్



గుంతకల్లులో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

**పామిడి:** విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జెడ్పీ సీఈఓ శివశంకర్ హెచ్చరించారు మండలంలోని ఎద్దులపల్లి పంచాయతీ గ్రామాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులపై ప్రజలతో మాట్లాడారు. రోజూ ఉదయం 7గంటలకే ఇంటింటికీ వెళ్లి పొడి, తడి చెత్తలను వేర్వేరుగా సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అలాగే సకాలంలో వాటర్ ట్యాంకులను శుభ్రపర్చాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. నిర్వహణపై సిబ్బందితో సమీక్షించారు. ఆయన వెంట ఎంపీడీఓ కే తేజ్యోత్స్న, జీ వీరా, గ్రామస్తులు పాల్గొన్నారు.

**పరిసరాల పరిశుభ్రత బాధ్యతగా తీసుకోవాలి**

**గుంతకల్లు/గుంతకల్లు టౌన్/యాడికి:** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పిలుపునిచ్చారు. బుధవారం గుంతకల్లులోని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో స్వచ్ఛతా హై సేవ కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం సీఎస్ గుప్తా రైల్వే ఉద్యోగులు, ఆర్పీఎఫ్‌లతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రైల్వేస్టేషన్ పరిసరాల్లో డీఆర్ఎం, ఏడీఆర్ఎం సుధాకర్ ఇతర ఉద్యోగులు చెత్తను శుభ్రం చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గుంతకల్లులోని మెయిన్‌రోడ్డులో మున్సిపల్ అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ నయీమ్ అహ్మద్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవి, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, వేణుగోపాల్‌రెడ్డి, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, వార్డు శానిటేషన్ కార్యదర్శులు, డ్వాక్రా లీడర్లు పాల్గొన్నారు. అదేవిధంగా యాడికి మండలంలోని నిట్టూరు, చిక్కేపల్లి గ్రామాల్లో డాక్టర్ పరమేశ్వర ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు యూనివర్సల్ ఇమినైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాల ఆవస్యకతను వివరించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామ్ ప్రసాద్ గౌడ్, ఏ ఎన్ఎం సరస్వతి, ఆశా కార్యకర్తలు రాజేశ్వరీ, నాగేశ్వరీ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

# మహిళల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

**గుంతకల్లుటౌన్/గుంతకల్లు రూరల్/శింగనమల/పామిడి/బుక్కరాయసముద్రం/:** మహిళల ఆరోగ్య పరిరక్షణే 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమ లక్ష్యమని డీఎంహెచ్ఓ ఈ.భ్రమరాంబదేవి అన్నారు. బుధవారం గుంతకల్లు పట్టణం బెంచికొట్టాలలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ మహిళల్లో వచ్చే అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టేందుకే ప్రభుత్వం 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మహిళలకు వివిధ రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తగిన వైద్యసేవలు అందజేస్తామన్నారు. బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడంతో పాటు అవగాహన కార్యక్రమాన్ని నెలరోజుల పాటు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ గంగాధర్, డాక్టర్ అరుణ, డాక్టర్ హరిత, వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా, కార్యకర్తలు పాల్గొన్నారు.అలాగే గుంతకల్లు మండలం నాగసముద్రం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మి, ఎంపీటీసీ తులసమ్మ, మెడికల్ ఆఫీసర్ నవీన్‌కుమార్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా నార్పల మండలంలోని బి.పప్పూరులో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యురాలు సునీత, సర్పంచ్ సంజమ్మ, ఎంపీటీసీ పద్మాకర్ రెడ్డి, సీడీపీఓ భారతి, ఎంపీహెచ్ఈఓలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే పామిడి మండలంలోని ఎద్దులపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారి వీ సుధాకర్, సర్పంచ్ జీ వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో, బుక్కరాయసముద్రం మండలం బీకేఎస్, కొర్రపాడు పీహెచ్‌సీ కేంద్రంలో డాక్టర్లు స్వాతి లక్ష్మి, వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.

# యాజమాన్య పద్ధతులు పాటించాలి



వెన్నపూసపల్లిలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం



కరిడికొండలో రైతులతో కలసి పంటలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**యల్లనూరు:** అరటి పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం సూచించారు. బుధవారం మండలంలోని వెన్నపూసపల్లిలో అరటి పంటలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త అరటిలో యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు హరిశ్చంద్రారెడ్డి, కేశవరెడ్డి, నార్పల ఉద్యాన అధికారి నెట్టికంతయ్య, హార్టికల్చర్ అసిస్టెంట్ రామాంజినేయులు, వీహెచ్‌ఏ కార్తీక్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

**గుత్తి రూరల్:** వర్షాధారం కింద సాగు చేసిన కంది, ఆముదం, సజ్జ, ఆవరాల పంటలలో సంరక్షణ చర్యలు చేపట్టాలని అనంతపురం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్.విజయశంకర్, శాస్త్రవేత్తలు డాక్టర్.లక్ష్మణ్, డాక్టర్.ఐ.భాస్కర్‌రావు, డాక్టర్.కెసి.నటరాజ్ సూచించారు. మండలంలోని కరిడికొండ గ్రామంలో వాతవరణ సానుకూల పథకం ద్వారా సాగు చేసిన వేరుశనగ, కంది, ఆముదం, సజ్జ, అంతర పంటలను వారు పరిశీలించారు. అనంతరం రైతులకు పంటల సాగులో సూచనలు, మెలకువలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది సోమశేఖర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

### జగన్‌ను కలసిన వీఆర్ రామిరెడ్డి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వీఆర్ రామిరెడ్డి

**తాడిపత్రిటౌన్:** వైఎస్సార్‌సీపీ నాయకుడు, తాడిపత్రి మాజీ సమన్వయకర్త వీఆర్ రామిరెడ్డి బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా జగన్ తాడిపత్రి రాజకీయ పరిస్థితులపై ఆరా తీసినట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారన్నారు.

### 'తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం'

**తాడిపత్రి రూరల్/పెద్దపప్పూరు/యాడికి/యల్లనూరు/గుత్తి/శింగనమల:** తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని సీడీపీఓ సాజిదాబేగం సూచించారు. తాడిపత్రి పట్టణంలోని టైలర్స్ కాలనీలోని యుసీహెచ్‌సీ సబ్ సెంటర్,పాతకోట, మండలంలోని దిగువపల్లి హెల్త్ క్లినిక్‌లల్లో బుధవారం పోష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం పాటుపాడాలన్నారు. కార్యక్రమాల్లో మెడికల్ ఆఫీసర్లు యశశ్వి.సుమన్, కౌన్సిలర్లు హుస్సేన్‌బాష, హాజీబాష, ఫైజోస్, సూపర్‌వైజర్లు రామలక్ష్మి, ఉమాదేవి, లక్ష్మిదేవి, కో-ఆర్డినేటర్ పల్లవి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దపప్పూరు, యాడికి, యల్లనూరు, గుత్తి, నార్పల మండలాల్లో పోష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు.

### ఎరువుల షాపు తనిఖీ

**పుట్లూరు:** మండలకేంద్రంలోని ఎరువుల షాపును బుధవారం ఏడీఏ రవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులోని స్టాక్ వివరాలను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. అలాగే పుట్లూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు వ్యవసాయ శాఖలో అమలు అవుతున్న పథకాల గురించి వివరించారు. రైతులు ఈ- పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కాత్యాయని, ఏఈఓ నాగిరెడ్డి, వీహెచ్‌ఏ రవితేజ పాల్గొన్నారు.

### రక్తదానంపై అపోహలు వీడండి





రక్తదానం చేస్తున్న టూటౌన్ సీఐ మస్తాన్

**గుంతకల్లు:** అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకురావాలని టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ సూచించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో జేవీవీ ఆధ్వర్యంలో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా నేషనల్ వలంటరీ బ్లడ్ డోనేషన్ డేలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు సందర్భంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, అమ్మ దీవెన ట్రస్ట్ వ్యవస్థాపకుడు మేస్త్రీ దొడ్డప్ప, పెథాలజిస్ట్ డాక్టర్ ప్రజ్ఞ పవిత్ర సాయి, మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ప్రభాకర్, ల్యాబ్ టెక్నీషియన్ ఉమా, సంఘ సేవకులు లక్ష్మీ ప్రసాద్, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి

**గుత్తి రూరల్:** మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో సమస్యల పరిష్కరించాలని సర్పంచ్, ఎంపీటీసీలు అధికారులను కోరారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత మూడు నెలలలో అన్ని శాఖలలో జరిగిన ప్రగతి, ప్రతిపాదనలకు సంబంధించిన నివేదికలను ఆయా శాఖల అధికారులు వివరించారు. ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఎవైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలు, తాగునీటి సమస్య పరిష్కరించడంతోపాటు సీసీ రోడ్లు మంజూరు చేయాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది అబ్దుల్, రాజేష్, వాసు, సర్పంచ్‌లు చిన్న ఆంజనేయులు, గోపాల్, వాసుదేవరెడ్డి, వెంకటేష్, మస్తాన్, ఎంపీటీసీ సుమలత, కార్యదర్శులు ధనలక్ష్మి, వెంకటేష్, ఏపీఓ రమేష్, ఎంఈఓ రవినాయక్, పాల్గొన్నారు.

# పీఆర్‌సీ వేసి ఐఆర్ ప్రకటించాలి



యాడికిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

**యాడికి:** కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పీఆర్‌టీయూ నాయకులు మండిపడ్డారు. బుదవారం మండలంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కేశవ నాయుడు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రతి పాఠశాలకు వెళ్లి పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌సీ కమీషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. అంతకుముందు రాయలచెరువు ఉన్నత పాఠశాలలో ఉత్తమ హెచ్ఎంగా అవార్డు అందుకున్న డేనియల్‌ను పీఆర్‌టీయూ నాయకులు శాలువాలు, పూలమాలలో సత్కరించారు. కార్యక్రమంలో రవీంద్ర, రఘురామయ్య, షేక్షావలి, రామాంజనేయులు, హనుమంతనాయుడు, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీల నియామకం



నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

**గుంతకల్లు రూరల్:** వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా గ్రామ కమిటీల నియామకం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.రాము, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దినేని రంగనాయకులు, పంచాయతీ రాజ్ విభాగం కమిటీ అధ్యక్షుడు కసాపురం తిక్కస్వామి, రైతు విభాగం కమిటీ అధ్యక్షుడు బాబూరావు, సింగిల్ విండో మాజీ ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, గుంతకల్లు మండల ఉపాధ్యక్షుడు హనుమంతు, బీసీసెల్ అధ్యక్షుడు అశోక్, మండల వికలాంగుల అధ్యక్షుడు దండు రంగనాయకులు, వైటీ చెరువు దశరథ తదితర నాయకులు బుధవారం గుంతకల్లు మండలంలోని కసాపురం, దోసలుడుకి, సంగాల, గుండాల తండా, మొలకలపెంట తండా, మొలకలపెంట, శంకరబండ, కొంగనపల్లి, ఓబుళాపురం, మైనాపురం, మైనాపురం తండా, వైటీ చెరువు, దంచర్ల, పాతకొత్తచెరువు, నల్లదాసరపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.

# వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

**గుత్తి రూరల్:** ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడంలో ముఖ్య భూమిక పోషిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని మండల వీఆర్‌ఏల సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆర్ఐ హనుమాన్ ప్రసాద్‌కు వీఆర్‌ఏలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల వీఆర్‌ఏల సంఘం నాయకులు సుధాకర్, నారాయణస్వామి, జగదీష్ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలన్నారు. 60 ఏళ్లు పైబడిన ప్రతి వీఆర్‌ఏ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. రీసర్వే విధులు నిర్వహించే వీఆర్‌ఏలకు టీఏ, డీఏ చెల్లించాలన్నారు. ఈ నెల 18, 19 తేదిలలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట, 20న ఆర్డీఓ కార్యాలయం, 22న కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు రామ్‌ప్రసాద్, సుధాకర్‌బాబు, ధను, మల్లన్న, వినోద్, యుగంధర్, రమణ, పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



నందిని

**తాడిపత్రిటౌన్:** రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు తాడిపత్రి క్రీడాకారిణి నందిని ఎంపికైనట్లు కోచ్ వంశీ బుధవారం తెలిపారు. గత 16న కొనకొండ్లలో జరిగిన జిల్లా జూనియర్ బాలిక విభాగంలో ప్రతిభ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ నెల 22 నుంచి విజయవాడలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడీ పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

### రగ్బీలో రాష్ట్ర స్థాయికి ..



మానస

**శింగనమల:** మండలంలోని సోదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మానస రగ్బీ పోటీలలో జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సిరాజుద్దీన్, పీడీ బయపరెడ్డి బుధవారం తెలిపారు. మానస అండర్-14 విభాగంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలోని ఆర్‌డీటీ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో రాణించి, రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**బుక్కరాయసముద్రం:** మండలంలోని కొర్రపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ నారాయణ, పీడీ నిరంజన్‌రెడ్డి, తెలిపారు. ఇటీవల ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంలో జరిగిన 69వ ఆంధ్రప్రదేశ్ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో కొర్రపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన రేవంత్, థామస్, రగ్బీ పోటీల్లో ధనుంజయ, మార్షల్ ఆర్ట్స్‌లో ధనుష్, గౌతమ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ కన బరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

### బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**పుట్లూరు:** అనంతపురంలో ఈ నెల 16న నిర్వహించిన స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో పుట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు నరేష్, మణికంఠ, జగన్‌మోహన్‌రెడ్డి, అలీఫ్‌కుమార్, కార్తీక్, మధుకిరణ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నరహరి ఎంపికపై హర్షం



కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

**గుత్తి:** వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా గుత్తికి చెందిన గంటా నరహరి నియామకంపై గుత్తిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఆయన స్నేహితులు, సంబరాలు నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాణా సంచ కాల్చారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఇంత పెద్ద పదవి అప్పగించిన వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటానన్నారు. పదవిని బాధ్యతగా భావించి పార్టీ బలోపేతమే లక్ష్యంగా అడుగులు వేస్తానన్నారు.

## సంక్షిప్త సమాచారం

**'ఎంపీఆర్ గేట్లకు మరమ్మతు చేయాలి'**

**గార్లదిన్నె:** మండలంలోని ఎంపీఆర్ గేట్లకు మరమ్మతులు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని 'ప్రసాద్ భవనం 'లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీఆర్ గేట్లు వద్ద నీరు లీకేజవుతోందన్నారు. ప్రభుత్వం కనీసం డ్యాం గేట్లు మరమ్మత్తులు చేయకపోవడం దారుణమన్నారు. లీకేజీ వల్ల నీరు వృథా అవుతున్న కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే డ్యాం గేట్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రీనాథ్, సీపీఐ మండల కార్యదర్శి రాముడు, శింగనమల మండల కార్యదర్శి మధు, వన్నూర్ స్వామి, రైతు సంఘం నాయకులు క్రిష్ణ, నల్లప్ప, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**అరటికి మద్దతు ధర కల్పించాలి**

**పెద్దవడుగూరు:** అరటి పంటకు మద్దతు ధరకల్పించి రైతులను ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు వెంకట్రాముడుయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని క్రిష్టిపాడులో సాగు చేసిన అరటి తోటలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, సుధాకర్‌గౌడ్, రంగారెడ్డి, రామాంజనేయులు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

**పుస్తకావిష్కరణ**



పుస్తకం ఆవిష్కరిస్తున్న సీఐ యుగంధర్

**పామిడి:** పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వేర్వేరుగా 2016 దివ్యాంగుల హక్కుల చట్టం తెలుగు అనువాద పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి అనంతపురం జిల్లా కో-ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అనువదించిన పుస్తకాన్ని తహసీల్దార్ సీ షర్మిల, సీఐ వీ యుగంధర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాకే ఆంజనేయులు, మహిళా అధ్యక్షురాలు వడ్డే లక్ష్మీదేవి, మిమిక్రీ కళాకారుడు లింగమూర్తి, మైనార్టీ నాయకుడు రసూల్, పామిడి మండల వికలాంగుల అధ్యక్షుడు కేశవాచారి, ఉపాధ్యక్షుడు సర్వేశ్, సహాయకుడు సుధాకర్, కమిటీ మెంబర్లు శివన్న, నరసింహులు, ప్రకాష్, నాగభూషణం పాల్గొన్నారు.

**సీసీ రోడ్డు నిర్మించండి**

**పామిడి:** పట్టణంలోని నెహ్రూనగర్‌లోని నూతన ఈద్గా వెనుక గల సీఎస్ఐ చర్చి వీధికి సీసీ రోడ్డు నిర్మించి ఇక్కట్లు తీర్చాలని ఆ వీధివాసులు ఎంపీడీఓ కే తేజ్యోత్స్నకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాలనీవాసులు వడ్డే సూర్యనారాయణ, పీ అనిల్‌కుమార్ రాజా, వీ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

**దివ్యాంగులకు నిత్యావసరాల అందజేత**

**తాడిపత్రి టౌన్:** పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం భవనంలో బుధవారం 25 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం తాడిపత్రి శాఖ అధ్యక్షుడు సత్యప్రసాద్, సభ్యులు వీరారెడ్డి, హనుమంతరెడ్డి, కుళ్లాయిరెడ్డి, సుబ్రమణ్యం, డిప్యూటీ పారా మెడికల్ అధికారి బాల ఓబులు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ**

**గుంతకల్లుటౌన్:** పట్టణంలోని డాక్టర్ సరోజినీనాయుడు మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లోని 50 మంది విద్యార్థినులకు మధ్యాహ్న భోజన ప్లేట్లు, గ్లాసులను ఆంగ్ల ఉపాధ్యాయురాలు సరస్వతి అందజేశారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెను హెచ్ఎం శంకరయ్య, తోటి ఉపాధ్యాయినులు సత్కరించారు.

**ఘనంగా ఏకాదశి పూజలు**

**పామిడి:** పట్టణంలోని చిన్న విఠోబ దేవాలయంలో బుధవారం ఏకాదశి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రుక్మిణీ పాండురంగుని శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజన బృందం సంకీర్తనాలాపనల నడుమ రుక్మిణీ పాండురంగస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రాకారోత్సవం గావించారు.

**'మార్కెట్ యార్డు అభివృద్ధే లక్ష్యం'**

**గుంతకల్లు రూరల్:** మార్కెట్ యార్డు అభివృద్ధే లక్ష్యంగా కమిటీ సభ్యులు కృషి చేయాలని సెక్రటరీ బాలాజీ, చైర్‌పర్సన్ సుగాలి లక్ష్మీదేవి సూచించారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో యార్డు కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మార్కెట్ యార్డు అభివృద్ధిలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు. 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మార్కెట్‌యార్డులో కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించగలిగితే ఆదాయ వనరులు పెరుగుతాయని, అలాగే ఏసీ గోడౌన్ల నిర్మాణం చేపట్టి వాటిని లీజుకు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు.

**ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయం**

**పామిడి:** ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ఎస్టీయూ ధ్యేయమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రామాంజనేయులు అన్నారు. పామిడి మండలంలో ఎస్టీయూ ముమ్మర సభ్యత్వ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్జిత సెలవుల నగదు బకాయిలను తక్షణం చెల్లించాలన్నారు. డీఏలు వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్‌సీ ఆలస్యం దృష్ట్యా తక్షణం 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకుడు నాగభూషణం, పామిడి మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మండల నాయకులు నర్సింహారెడ్డి, వాసుదేవ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.